
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 11 ఫిబ్రవరి 2025





మరియతనయ.. మధుర హృదయ

- రెండోరోజూ ఘనంగా గుణదల తిరునాళ్లు
- కొండపై ఏసు శిలువ మార్గానికి పోటెత్తిన భక్తులు

గుణదల తిరునాళ్లు రెండోరోజు సోమవారం కూడా ఘనంగా జరిగాయి. కొండ కింద ప్రార్థనామందిరంతో పాటు గుహ ప్రాంగణం, కొండపైన శిలువ మార్గం భక్తులతో నిండిపోయాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

6



విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతున్న తిరుపతమ్మ ఆలయం(ఇన్‌సెట్‌లో) గోపయ్య సమేత తిరుపతమ్మ ఉత్సవ మూర్తులు

తిరునాళ్ల శోభ

పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్లకు సర్వంసిద్ధమైంది. మంగళవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం రాత్రి 9.32 గంటలకు గోపయ్య సమేత తిరుపతమ్మ కల్యాణోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.


8

విజయోస్తు..!

కృష్ణా మిల్క్ యూనియన్ వజ్రోత్సవ ప్రస్థానం

- వార్షిక టర్నోవర్ రూ.1,200 కోట్లు.. పాల సేకరణ 11 కోట్ల లీటర్లు
- 2 లక్షల మంది పాడి రైతులకు రోజువారీ ఆదాయం
- 4 వేల మందికి ఉపాధి.. 84 రకాల పాల ఉత్పత్తులు
- వీరవల్లిలో 'కామధేను' ప్రాజెక్టు అందుబాటులోకి..

8



చలసాని ఆంజనేయులు



వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేనులో ఎన్టీఆర్ పాల ప్రాంగణం

'విజయ డెయిరీ' ఇది పేరు కాదు. 60 ఏళ్ల కృష్ణామిల్క్ యూనియన్ కృషికి నిదర్శనం. 'పాల'కవర్గాల కష్టానికి ప్రతిఫలం. 1965లో స్థాపించిన ఈ యూనియన్ అంచెలంచెలుగా ఎదుగుతూ, ఎన్నో విజయాలను నమోదు చేస్తూ, జాతీయ స్థాయిలో మార్కెట్‌ను శాసించే స్థాయికి ఎదిగింది. 11 కోట్ల లీటర్ల పాల సేకరణతో పాటు రూ.1,200 కోట్ల టర్నోవర్‌తో ఈ యూనియన్ అంతులేని ఖ్యాతిని ఆర్జించింది. 2 లక్షల మంది పాడి రైతులకు జీవనాధారంగా, దక్షిణ భారతంలోనే 84 రకాల పాల ఆధారిత ఉత్పత్తులతో నెంబర్‌వన్‌గా, పాడి రైతులకు నాలుగు నెలలకోసారి బోనస్, సభ్యులకు లాభాల్లో వాటా, అనేక సంక్షేమ పథకాలు, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధితో దినదినప్రవర్ధమానమవుతోంది. తాజాగా వీరవల్లిలో ప్రాజెక్టు 'కామధేను'తో మరింత ముందుకు వెళ్తూ వజ్రోత్సవ సంబరాలను జరుపుకొంటున్న కృష్ణా మిల్క్ యూనియన్ 'విజయ' ప్రస్థానంపై కథనం.

పైసలిస్తేనే పని..!

అవినీతి కంపుకొడుతున్న సర్వే విభాగం

మచిలీపట్నం మండలంలో పాతుకుపోయిన మండల సర్వేయర్

- ఒకే మండలంగా ఉన్నప్పుడు.. రెండుగా విభజించినా ఆయనదే హవా!
- ఒక్కో పనికి రూ.20 వేల నుంచి 50 వేల వరకు వసూలు
- సచివాలయ సర్వేయర్లను గుప్పిట్లో పెట్టుకుని వ్యవహారాలు
- ముడా భూముల్లో బుసక తవ్వకాల్లోనూ వీరి హస్తం!
- పోర్టు రోడ్డు కం రైలు మార్గాలకు భూముల సర్వేలోనూ ఇష్టారాజ్యం



జిల్లా కేంద్రంలోని మచిలీపట్నం మండలం రెవెన్యూ విభాగంలో అవినీతి పెరిగిపోయింది. పైసలిస్తేనే ఏ పనైనా చేస్తామన్నట్టుగా ఇక్కడి పరిస్థితి తయారైంది. భూములు సర్వే చేయించుకోవాలనుకునే రైతులు దరఖాస్తు చేసుకోవడంతో పాటు సర్వే సిబ్బందిని ప్రసన్నం చేసుకోవాల్సిందే. పలుమార్లు వారి చుట్టూ తిరిగితే కాలు బయట పెడతారు. అదికూడా అడిగినంత పైసలు ముట్టచెబితేనే. మామూళ్లు ఇవ్వలేమంటే ఇక నెలల తరబడి వారి దరఖాస్తు అక్కడే. మచిలీపట్నం మండలంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మండల సర్వేయర్‌దే ఇక్కడ రాజ్యం. ఈయన కనుసన్నల్లోనే సచివాలయాల్లోని సర్వేయర్లు పనిచేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరి అవినీతిపై కలెక్టర్, జేసీ, మంత్రిని కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలం ఇటీవల కాలం వరకు ఒకే మండలంగా ఉండేది. ఇక్కడ మండల సర్వేయర్‌గా సుమారు 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగి మండలం మొత్తాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్నారు. ఇటీవల మచిలీపట్నం మండలాన్ని నార్త్, సౌత్ మండలాలుగా విభజించారు. రెండు మండలాల్లోని సచివాలయాల్లో పనిచేసే సర్వేయర్లు ఈయన కనుసన్నల్లోనే పనిచేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇద్దరు తహసీల్దార్ల కన్నా ఈ సర్వేయర్ వద్దనే ప్రతిరోజూ భూముల పంచాయితీలు అధికంగా జరుగుతుండటం గమనార్హం. భూముల సర్వే కోసం దరఖాస్తు చేసుకుని తన వద్దకు వచ్చిన రైతులతో సదరు సర్వేయర్ బేరం మాట్లాడతారు. వివాదంలో ఉన్న భూములను సర్వే చేసేందుకు పెద్దఎత్తున నగదును డిమాండ్ చేస్తారనే ఆరోపణలు

మిగతా 6లో..

ముడా భూముల్లోనూ తవ్వకాలకు సహకారం

మచిలీపట్నం పోర్టు నిర్మాణం కోసం మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)కు రైతులు ఎకరం భూమిని రూ.25 లక్షల చొప్పున 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం హయాంలో విక్రయించారు. ఈ భూముల్లో ఇటీవల కాలంలో బుసక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ముడాకు చెందిన భూముల సర్వే నంబర్లలోని భూములను బుసక రవాణా చేసేవారికి తెలియజేసి, వారు అక్కడి నుంచి బుసక రవాణా చేసేందుకు సర్వేయర్‌లు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.






ఖమ్మం కతోలిక పీఠం బిషప్ సగిలి ప్రకాష్ సమిష్టి దివ్యపూజాబలి సమర్పణ, గుణదల లూర్దుమాత మహోత్సవాలకు హాజరైన భక్తులకు దివ్యసత్ప్రసాదం అందజేసిన పీఠాధిపతులు

ఆధ్యాత్మిక శిఖరం గుణదల పుణ్యక్షేత్రం

మరియమాత దర్శనానికి రెండోరోజు పోటెత్తిన భక్తులు



విద్యుత్ దీపాల వెలుగులో గుణదల లూర్దుమాత క్షేత్రం

గుణదల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో ప్రసిద్ధ క్రైస్తవ పుణ్యక్షేత్రాల్లో గుణదల లూర్దుమాత పుణ్యక్షేత్రం ఒకటి అని.. గుణదలమాతగా పేరొందిన క్రైస్తవ క్షేత్రానికి దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారని ఖమ్మం కతోలిక పీఠం బిషప్ సగిలి ప్రకాష్ అన్నారు. కొండ నడుమ సహజసిద్ధంగా వెలసిన గుహలో లూర్దుమాత స్వరూపం శిఖరాగ్రాన ఉన్న ఏసుక్రీస్తు శిలువను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేయడం ఇక్కడ విశేషం అని ఆయన చెప్పారు. సోమవారం రెండోరోజు గుణదల మహోత్సవాలకు ముఖ్యఅతిథిగా ఖమ్మం కతోలిక పీఠం బిషప్ సగిలి ప్రకాష్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు సందేశమిస్తూ సంతాన ప్రాప్తి కోసం మహిళలు కొండపైన మరియ మాతను దర్శించుకుని చెట్లకు ముడుపులు కడితే సంతాన ప్రాప్తి కలుగుతుందన్నారు. కతోలిక పుణ్యక్షేత్రం అయినప్పటికీ ఇక్కడ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల సమ్మేళనం స్పష్టంగా కనబడుతుందన్నారు. గుణదల లూర్దుమాత 101వ మహోత్సవంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మరియమాత ఆశీర్వచనాలు మెండుగా అందాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. గుణదల పుణ్యక్షేత్రం వందేళ్లుగా భక్తుల కోర్కెలు తీర్చేతల్లిగా నీరాజనాలు అందుకుంటుందని తెలిపారు. గుణదలమాత పుణ్యక్షేత్రం స్వాతంత్ర్యం రాక పూర్వం నుంచే క్రైస్తవ మిషనరీలు తాడిత, పీడిత ప్రజలకు సేవలందిస్తూ ప్రజల విశ్వాసానికి దిక్సూచిగా నిలిచాయన్నారు. లోక కళ్యాణార్థం యేసుక్రీస్తు తన రక్తాన్ని చిందించారని తెలిపారు. సర్వేశ్వరుడు సదా మీతో ఉండుగాక ఆమెన్ అని భక్తులకు వివరించారు. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ.. గుణదల లూర్దుమాత తిరునాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారని



గుణదల లూర్దుమాత

అంచనా వేస్తున్నామన్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పూజాపీఠంపై సగిలి ప్రకాష్, బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఏలేటి విలియం జయరాజు, వికర్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు తదితర డయానిస్‌కు చెందిన గురువులు 100 మంది సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. అనంతరం బిషప్‌లు భక్తులకు పవిత్ర దివ్యసత్ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ తోట సునీల్ రాజు, డైరెక్టర్ కొలకాని మరియన్న, గురువులు గాబ్రియేలు, ఎం.చిన్నప్ప, జి.మైఖేల్, పల్లె జోజి బాబు తదితరులు పాల్గొన్నారు.

● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రెండోరోజు సోమవారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. క్రైస్తవ భక్తిగీతాలు, సెయింట్ ఆన్స్ స్కూల్ నర్సింగ్ విద్యార్థులు ప్రదర్శించిన నిరీక్షణ యాత్రికులు సాంస్కృతిక కార్యక్రమాలు.. కళాదర్శిని ప్రదర్శించిన దేవుని కరుణ నృత్యరూపకం, నెహ్రూ పేట విచారణ నుంచి సంసోను డెలీలా బుర్రకథ గుమ్మడి జయరాజు నాట్యమండలి ప్రదర్శించిన యేసు కృప నాటకం ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



ఏపీలో గత ఐదేళ్లలో 36 నైపుణ్యలోటు అధ్యయన కేంద్రాలు

» ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి జయంతి చౌదరి సమాధానం

వన్‌టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్ల కాలంలో పలు పరిశ్రమలకు నైపుణ్యాలోటు అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత స్వతంత్ర సహాయ మంత్రి జయంతి చౌదరి తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్య లోటు అధ్యయనాలపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఐదేళ్లకాలంలో 36 సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్‌ను ఏర్పాటు చేయగా, 2019 నుంచి ఆయా పరిశ్రమల అవసరాలను బట్టి కార్మిక వనరుల పరిశీలన, నైపుణ్యాభివృద్ధికి అవసరమైన మార్గదర్శకాలు, పరిశ్రమల అవసరాలను అంచనా వేయడం వంటి అంశాలపై అధ్యయనాలు జరిగాయన్నారు. తిరుపతి, విశాఖపట్నం, నెల్లూరు, అమరావతి, చిత్తూరు, కోనసీమ, కృష్ణా, గుంటూరు, అనంతపురం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో పలు పరిశ్రమలకు సంబంధించి అధ్యయనాలు జరిగాయన్నారు. 2024-25కు సంబంధించి నైపుణ్య అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను మరింత సమగ్రంగా అమలు చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు.



హైదరాబాద్ వెళుతున్న బస్సుకు జెండా ఊపుతున్న టీడీపీ నేతలు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

» ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : 'వికసిత్ పంచాయత్' గ్రామాల అభివృద్ధి లక్ష్యంతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నియోజకవర్గ పరిధిలోని 290 గ్రామాల అభివృద్ధికి రంగం సిద్ధం చేశారు. దీనిలో భాగంగా 100 మంది యువతకు స్వయం ఉపాధి రంగంలో శిక్షణ ఇప్పించే క్రమంలో తొలివిడతగా 33 మందిని ఎంపిక చేసి హైదరాబాద్‌కు పంపించారు. ఈనెల 16వరకు ఎన్ఐఆర్, డీపీఆర్‌లో వారం రోజులపాటు శిక్షణలో యువకులు పాల్గొననున్నారు. గురునానక్‌కాలనీలోని కార్యాలయం నుంచి బస్సును మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, ఏపీ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో గతేడాది నవంబరు 1న ఎంపీ శివనాథ్ స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కోసం ఒకరోజు శిక్షణ తీసుకున్నారని, వారి సహకారంతో రాష్ట్రంలోని గ్రామాలను మోడల్‌గా తీర్చిదిద్దాలని సంకల్పం చేస్తున్నారన్నారు. స్వయం ఉపాధి అవకాశాలపై శిక్షణకు వెళ్లే యువతకు కేశినేని ఫౌండేషన్ ద్వారా నెలకు రూ.10వేలు ఉపకార వేతనం అందించటంతో పాటు, వారం రోజుల శిక్షణకు అయ్యే ఖర్చు రూ.15లక్షలు ఎంపీ శిక్షణా సంస్థకు చెల్లించారని తెలిపారు. శిక్షణ పొందిన యువత రాబోయే కాలంలో వారి మండలాలలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తారని చెప్పారు. ప్రతి ఇంటికి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్త ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో చంద్రబాబు ఆకాంక్షలను నెరవేరేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ అకుంఠిత దీక్షతో పనిచేస్తున్నారని నాయకులు తెలిపారు.

పేదల బియ్యం దారి మళ్లితే కఠిన చర్యలు

» అవకతవకలకు తావులేకుండా నిరంతర తనిఖీలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్/మొగల్రాజపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పేదల బియ్యం పక్కదారి పడితే కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. రేషన్ బియ్యం దారిమళ్లకుండా పటిష్ట నిఘా పెట్టామని పేర్కొన్నారు. భవానీపురంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సిడబ్ల్యూసి) గోడౌన్‌ను ఆయన సోమవారం తనిఖీ చేశారు. రైస్ ఏజ్ టెస్ట్‌ను పరిశీలించటంతో పాటు రికార్డులు, భౌతిక నిల్వలను సరి చూశారు. అనంతరం సీతారామపురంలోని డిపో 225 నెంబరు చౌక ధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. లైసెన్స్, ఆన్‌లైన్ స్టాక్, సరుకు నాణ్యత, తదితరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పీడీఎస్ బియ్యంలో సీఎంఆర్ బియ్యం కలవకుండా చూడటంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు నిఘాను పటిష్టం చేసినట్టు తెలిపారు. ప్రతి బఫర్ గోడౌన్‌ను తరచూ తనిఖీ చేస్తామని చెప్పారు. రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, ఎండీయూ ఆపరేటర్ల కార్యకలాపాలను అధికారులు తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో 957 రేషన్ దుకాణాలున్నాయని, ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎప్పటికప్పుడు తనిఖీ నిర్వహించి లోపాలుంటే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు ప్రతి నెలా 20, తహసీల్దార్లు నెలకు 5 రేషన్ దుకాణాలను తనిఖీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, పేదల ఆహార భద్రతకు భరోసా కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాస్, డీఎస్‌వో ఎ.పాపారావు, ఏఎస్‌వో శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

పిల్లల సంరక్షణ అందరి బాధ్యత

» కృష్ణా కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పిల్లల సంరక్షణ బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో డిస్ట్రిక్ట్ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం జిల్లా సీనియర్ సివిల్‌జడ్జి కేవీ రామకృష్ణయ్యతో కలిసి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలల సంరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. గ్రామ, మండలస్థాయిలో పిల్లల రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, బడి మానివేసిన పిల్లలను బడిలో చేర్పించేందుకు ఈ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పిల్లలను పనికి పంపుతున్న తల్లిదండ్రులను గుర్తించి, వారికి చదువు విలువ తెలియజేసి వారి పిల్లలను బడికి పంపే ఏర్పాట్లు చేయాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా ప్రజలకు కనీస అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీఈవో పీవీజే రామారావు, డీసీపీవో మనీషా, గిరిజన సంక్షేమశాఖ అధికారి ధూర్జటి, సీపీవో గణేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● పకడ్బందీగా పది పరీక్షలు

మార్చి 17 నుంచి జరగనున్న పదోతరగతి, ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ, వివిధశాఖల అధికారులతో సోమవారం గూగుల్ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది జిల్లాలో 22,341మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలో 141 కేంద్రాలలో పరీక్షలు సక్రమంగా నిర్వహించేందుకు 145మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, పదిమంది రూట్ ఆఫీసర్‌లను, 52సిట్టింగ్‌స్క్వాడ్, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించడం జరిగిందన్నారు. పరీక్షాకేంద్రాలలో అన్నిసౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, డీఈవో పీవీజే రామారావులు పాల్గొన్నారు.

గ్రామంలో ఇసుక క్వారీ మాకొద్దు బాబోయ్!

» ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థుల నిరసన

పెనమలూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామంలో ఇసుక క్వారీ వద్దంటూ చోడవరం గ్రామస్థులు అధికారులకు తెగేసి చెప్పారు. సోమవారం చోడవరం గ్రామానికి వచ్చిన అధికారులు చోడవరం కృష్ణా నదిలో ఏడు



అధికారుల వద్ద తమ అభ్యంతరాలను తెలుపుతున్న గ్రామస్థులు

హెక్టార్లలో ఇసక నిల్వలు ఉన్నాయని, డంపింగ్ చేసి ప్రజలకు అందుబాటులో ఉంచవచ్చని.. దీనిపై ప్రజాభిప్రాయసేకరణకు ఉయ్యూరు ఆర్డీవో షారోన్, తహసీల్దారు గోపాలకృష్ణ, ఇతర అధికారులు వచ్చినట్టు తెలిపారు. దీంతో గ్రామస్థులు అధికారులతో మాట్లాడుతూ, ఇసుక క్వారీ ఏర్పాటు చేసే పక్షంలో భూగర్భజలాలు అడుగంటుతాయని, రైతులకు నీళ్లు అందుబాటులో ఉండవని తెలిపారు. నదిలో ఇసుక త్రవ్వకాలతో గుంతలు ఏర్పడి ఈతకు వెళ్లే స్థానికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అధికారులతో అన్నారు. ఇప్పుడిప్పుడే గ్రామ రోడ్లు బాగుపడుతున్నాయని, 60-70 టన్నుల భారీ వాహనాలు ఇసుక లోడుతో రోడ్లను నాశనం చేస్తాయని వాపోయారు. కరకట్ట వెంట ఇన్ని క్వారీలు ఉండగా మరో క్వారీ అవసరం లేదని తేల్చి తెలిపారు. దీంతో ఆర్డీవో షారోన్, తహసీల్దారు గోపాలకృష్ణలు ప్రజల అభిప్రాయాలను వీడియో తీసుకొని క్వారీ ఏర్పాటు వల్ల ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను పై అధికారులకు నివేదిస్తామని వెళ్లిపోయారు.

పైసలిస్తేనే పని..!

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. రైతులను తన ఇంటికి రప్పించుకుని మరీ వసూళ్లకు పాల్పడటం ఈయన ప్రత్యేకత. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఈ సర్వేయర్ పూర్తిస్థాయిలో సహకరిస్తూ భూమి రికార్డులను తారుమారు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి.

పోర్టు కోసం రోడ్డు కం రైలు మార్గాల భూముల సర్వేలో మాయాజాలం

బందరు పోర్టుకు సంబంధించి రోడ్డు కం రైలు మార్గాల కోసం 280 ఎకరాలకుపైగా భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసింది. కరగ్రహారంలో 253 సర్వే నంబరులోని 7.02 ఎకరాల అసైన్డ్ భూమిని రోడ్డు కం రైలు నిర్మాణం కోసం సేకరించడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ భూములకు సంబంధించి ఇద్దరు అసలు రైతుల పేర్లను కాకుండా వేరే వ్యక్తుల పేర్లను తన సర్వే నివేదికలో చూపారనే ఆరోపణలు ఉన్నాయి. అదే గ్రామంలోని 7/2 సర్వే నంబరులోని 54 మంది పేరున ఒక్కొక్కరికి అరెకరం చొప్పున ప్రొసీడింగ్ ఆర్డర్‌లు 30 సంవత్సరాల కిందట ఇచ్చారు. ఇందులో ఆరు ఎకరాల భూమిని రోడ్డు కం రైలు మార్గాలకు సేకరించారు. అయితే ఈ భూములకు సంబంధించి ఫీల్డ్ మ్యాప్, సరైన పట్టాలు లేకుండానే గ్రామానికి చెందిన వైసీపీ చోటా నాయకుడి సూచనలతో అతని బంధువులు 12 మంది అనుభవదారులుగా ఉన్నట్లు చూపడంలో మండల, గ్రామ సర్వేయర్ పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో సర్వేయర్‌లకు పెద్దమొత్తంలో నగదు అందినట్లు సమాచారం. సర్వేయర్లు సూచించిన పేర్లు, నివేదికను ఆధారంగా చేసుకుని గతేడాది డిసెంబరులో భూసేకరణకు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఫిబ్రవరి 8వ తేదీ లోగా ఈ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నోటిఫికేషన్‌లో వచ్చిన పేర్లకు, అసలు అనుభవదారులుగా ఉన్న పేర్లకు తేడా ఉండటంతో కొందరు రైతులు ఈ విషయంపై రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో తమ అభ్యంతరాలను తెలియజేస్తూ అర్జీలు అందజేశారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. రైతుల నుంచి భూమిని సేకరిస్తే అసైన్డ్ భూమికి ఎకరానికి రూ.31.50 లక్షలు ధరగా నిర్ణయించారు.

చినకరగ్రహారం వ్యవహారంలోనూ అవినీతి

చినకరగ్రహారంలోని 7/2 సర్వే నంబర్లలోని కొంత భూమిని మచిలీపట్నం నగరానికి చెందిన వైసీపీ కార్పొరేటర్ సోదరుడు అతని బంధువులను అనుభవదారులుగా గతంలో ఈ సర్వేయర్ నమోదు చేశారు. ఈ భూములు తమవని గ్రామస్తులు తిరగబడ్డారు. ఎదురు తిరిగిన వారికి తలో రూ.2 లక్షలు ఇస్తామని అప్పట్లో తెరవెనుక బేరాలు కుదుర్చుకున్నారు. ఈ అంశంపై గతంలో పనిచేసిన కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో ఈ భూములకు నగదు ఇవ్వకుండా ఆయన పక్కన పెట్టేశారు. ఇదే భూమికి ఇటీవల కాలంలో కరగ్రహారం వైసీపీ కార్యకర్త సూచించిన వారి పేర్లను అనుభవదారులుగా ఉన్నట్లు చూపడానికి మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్ తమదైన శైలిలో తెరవెనుక చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి. ఏడాదిన్న కాలంలోనే భూములను వేర్వేరు వ్యక్తుల పేరున సర్వేలో చూపడం ఈ సర్వేయర్‌లకు చెల్లుబాటు అయ్యిందని, జరిగిన తంతు మొత్తాన్ని కరగ్రహారం గ్రామస్తులు మంత్రి కొల్లు రవీంద్రకు వివరించారు.

తాను లేకున్నా పలువురికి ప్రాణదానం



కోటేశ్వరరావు (ఫైల్)

కృత్తివెన్ను, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : తాను చనిపోతూ.. పలువురికి ప్రాణదానం చేసిన బుద్ధన కోటేశ్వరరావు నేటి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. కుటుంబసభ్యుల సమాచారం మేరకు మండల పరిధిలోని నీలిపూడి గ్రామానికి చెందిన బుద్ధన కోటేశ్వరరావు (55) ఈ నెల 5న బంటుమిల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతుండగా.. ఆదివారం రాత్రి కోటేశ్వరరావుకు బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు తెలిపారు. ఆయన చివరి కోరిక మేరకు కుటుంబ సభ్యులు అవయవదానం చేసేందుకు ముందుకువచ్చారు. గుండె, కాలేయం, కిడ్నీలను విజయవాడలో దానం చేయనున్నట్టు తెలిపారు. కోటేశ్వరరావు మృతి పట్ల మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ సంతాపం తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	121,130, 141
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

పాడి రైతుల అభ్యున్నతికి విజయ డెయిరీ కృషి

గన్నవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల అభ్యున్నతికి విజయ డెయిరీ కృషి చేస్తుందని డైరెక్టర్ పాలడుగు నాని అన్నారు. కృష్ణామిల్క్ యూనియన్ 60 వసంతాలు పూర్తిచేసుకున్న శుభతరుణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. గన్నవరం పాలకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రైతుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. 60 మంది పాడిరైతులకు వెండి గిన్నెలు బహూకరించారు. గన్నవరం వైస్ ఎంపీపీ సుధీర్, కాసరనేని రంగబాబు, అన్వేష్, గన్నవరం రూట్ మేనేజర్ తుమ్మల యశ్వంత్ పాల్గొన్నారు.



పాడి రైతులను సన్మానిస్తున్న పాలడుగు నాని

విద్యుత్ అధికారుల తనిఖీలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లో సోమవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు గృహ, వ్యాపార సముదాయాల సర్వీసులు తనిఖీ చేసి అనధికారికంగా అదనపులోడు వాడుతున్న వారి నుంచి రూ. 6,96,050 జరిమానా విధించినట్లు ఏపీసీపీ డీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ కృష్ణనాయక్ తెలిపారు. విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు, సిబ్బంది 23 బృందాలుగా ఏర్పడి 1841 గృహ, వ్యాపార సముదాయాల సర్వీసులు తనిఖీ చేయగా అందులో 267 సర్వీసులు అదనపు లోడు వాడుతున్నట్టు కనుగొని జరిమానా విధించినట్టు తెలిపారు. ఉయ్యూరు డీఈ హేమకుమార్, చల్లపల్లి డీఈఈ శివనాగేశ్వరరావు, విజిలెన్స్ ఏఈ షావలి పాల్గొన్నారు.







తిప్పనగుంటలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ.. కాటూరు హైస్కూల్‌లో..

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

అన్ని పీహెచ్‌సీల పరిధిలో జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం

ఉంగుటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని మండల పరిధిలోని ఇందుపల్లి, ఉంగుటూరు, పెదఅవుటపల్లి, ఆత్కూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు బి.శిరీష, వీవీ.సుబ్బారావు, కె.వాణి, కె.భవాని, కరీముల్లా మొహినుద్దీన్, సుజిత, మనోహర్‌రెడ్డి సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని నాలుగు పీహెచ్‌సీల వైద్యాధికారులు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నులిపురుగుల నివారణ (అల్బెండజోల్) మందులు పంపిణీ చేశారు.

హనుమాన్‌జంక్షన్ : జాతీయ నులిపురుగులు నిర్మూలన దినోత్సవం కార్యక్రమంలో భాగంగా బాపులపాడు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నులిపురుగు నివారణకు అల్బెం డజోల్ మాత్రలు పంపిణీ చేశారు. బాపుల పాడు, వట్లూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక ఆదిత్య బధిర విద్యాలయంలో విద్యార్థులకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ మాత్రలు పంపిణీ చేసి వాటి ప్రాధాన్యతను వివరించారు.



ఉంగుటూరులో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లి పీహెచ్‌సీ పరిధిలోని తిప్పనగుంట, కానుమోలు, వీరవల్లి, తదితర గ్రామాల్లో విద్యార్థులకు సోమవారం ప్రభుత్వం అందజేసిన అల్బెండజోల్ మాత్రలను పీహెచ్‌సీ డాక్టర్ ప్రణయ్ సాగర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి సర్పంచ్ పిల్లా అనిత, ఉపసర్పంచ్ లంక అజయ్, గుండపనేని ఉమా వరప్రసాద్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉయ్యూరు : కాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. నేషనల్ డీవార్మింగ్‌డే పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు పాల్గొని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు వేసి ప్రారంభించారు.

భవ్య రామాలయ నిర్మాణానికి రూ.7 లక్షల విరాళాలు

పెనమలూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పోరంకిలో ఈనెల 13న విగ్రహ ప్రతిష్ట జరగనున్న భవ్య రామాలయానికి భక్తులు మరో ఏడు లక్షలను విరాళాలుగా అందజేశారు. స్థానికులు బోడె వెంకటేశ్వరరావు, కృష్ణకుమారి దంపతులు ఐదు లక్షలు, కర్లపూడి జ్యోతి (యూఎస్ఏ) లక్ష, వీర్ల సుబ్బారావు, నాగలక్ష్మి దంపతులు లక్షను రామాలయ కమిటీ సభ్యులకు అందజేశారు.



విరాళం అందిస్తున్న వెంకటేశ్వరరావు, కృష్ణకుమారి దంపతులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రంగయ్యప్పారావుపేటలోని శ్రీకోదండ రామస్వామి దేవస్థాన అభివృద్ధి పనులకు దాతల సహకారం అభినందనీయమని కోశాధికారి పరుచూరి సుకన్య తెలిపారు. దేవస్థాన అభివృద్ధికి పరుచూరి ప్రసాద్, నందిని దంపతుల కుమారుడు జయసాయి గోపీకృష్ణ రూ.1,00,116 విరాళాన్ని అభివృద్ధి కమిటీకి సోమవారం అందజేశారు. అదే గ్రామానికి చెందిన మేడికొండ వెంకటకృష్ణారావు రూ. 7116, సుగసాని ప్రభాకరరావు రూ.10వేలు, పరుచూరి శ్రీహరి, ధనకోటేశ్వరరావు వేర్వేరుగా రూ.5వేలు అందజేసినట్లు అభివృద్ధి కమిటీ సభ్యులు వివరించారు.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్

గన్నవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్ పేర్కొన్నారు. గన్నవరంలో డివిజన్‌లోని బీసీ సంక్షేమ శాఖ హాస్టల్స్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు సోమవారం ప్రేరణ-శిక్షణ తరగతులను బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, మార్చి 17వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని పరీక్షలకు సమయాన్ని వృధా చేయకుండా బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ బీసీ సంక్షేమ అధికారి డివిజన్ పరిధిలోని వార్డెన్‌లు, సిబ్బంది పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మతల్లి తిరునాళ్ల

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : బిళ్లనపల్లిలో కొలువైన శ్రీఅంకమ్మ తల్లి తిరునాళ్ల వార్షిక మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు సాయివేణుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి తెల్లవారు ఝామున ప్రాతఃకాల అర్చన నిర్వహించారు. తదనంతరం అమ్మ వారికి గంగాస్నానం, అభిషేక పూజలు నిర్వహించారు. బుధవారం వరకూ నిర్వహించే తిరునాళ్లకు వివిధ రాష్ట్రాల నుంచి, విదేశాల నుంచి భక్తులు మొక్కుబడులు తీర్చుకునేందుకు వస్తారు.

ఘనంగా రుద్రాభిషేకం

మడిచర్లలో నూతనంగా నిర్మించిన దేవస్థానంలో మాఘమాసంలోని సోమవారం సందర్భంగా శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి వారికి మహారుద్రాభిషేక పూజలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు వేమూరి బాలసుబ్రమణ్యశర్మ ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవస్థాన ఆవరణలో శ్రీలక్ష్మీ శ్రీనివాస భజన సమాజం, శ్రీ సాయిరాం భజన సమాజం శివ చాలీసా పారాయణం నిర్వహించారు.



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ మహిళా నేత సాయికల్యాణి

ఆలపాటిని గెలిపించాలి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల సమస్యలను పరిష్కరించగల సత్తా ఉన్న నాయకుడు కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి శాసన మండలికి పంపించాలని టీడీపీ తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి కోరారు. సోమవారం బాపులపాడు జడ్పీ హైస్కూల్, సిద్ధార్థ విద్యాలయం, నారాయణ, చైతన్య టెక్నో, గౌతమ్ పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పరీక్షలపై భయాన్ని పోగొట్టేలా ప్రధాని చర్చ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో పరీక్షలపై భయాన్ని పోగొట్టి సానుకూల దృక్పథాన్ని పెంపొందించేలా ప్రధాన మంత్రి మోదీ సూచనలను పాటించాలని హెచ్‌ఎం లూథర్‌పాల్ అన్నారు. రేమల్లె హైస్కూల్‌లో దృశ్య శ్రవణ విధానం ద్వారా దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు లైవ్‌లో విద్యార్థులు తిలకించారు.



విజయ ప్రస్థానానికి వజ్రోత్సవ శోభ

దేశంలోనే అత్యున్నత బ్రాండ్ 'విజయ' డెయిరీ

దేశంలోనే అత్యధిక పాలసేకరణ ధర చెల్లిస్తూ పాడిరైతు ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్న విజయ డెయిరీ (కృష్ణా మిల్క్ యూనియన్) వజ్రోత్సవాలను జరుపుకొంటోంది. మార్కెట్‌లో ఎన్నో ప్రైవేటు డెయిరీలతో పోటీని తట్టుకుని అగ్రస్థానంలో నిలబడటం ఒక ఎత్తయితే.. కోట్లాది రూపాయల వ్యయంతో అధునాతన పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీలను నిర్మించి నిర్దిత సమయానికి ముందే ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తూ సహకార సంస్థల విభాగంలో మేటిగా నిలబడింది కృష్ణా మిల్క్ యూనియన్.

- ఆంధ్రజ్యోతి, చిట్టినగర్ /హనుమాన్‌జంక్షన్‌రూరల్



మొఫ్పి(మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ) కేంద్ర ప్రభుత్వ గుర్తింపు బోర్డు.

చిట్టినగర్‌లోని పాల ఫ్యాక్టరీ



1965లో స్థాపించిన కృష్ణా మిల్క్ యూనియన్ నేటి వజ్రోత్సవ ప్రస్థానంలోకి అడుగు పెట్టడంలో పాడి రైతుల విజయమే అతి ముఖ్యమైంది. పాడిరైతు కుటుంబాలకు అండగా నిలబడుతూ కోట్లాది రూపాయలతో క్షీరబంధు, కల్యాణమస్తు, ప్రతిభ లాంటి ప్రోత్సాహకాలను అందించటంతో పాటు ఆరోగ్యం కోసం హెల్త్‌కార్డులు, ఆరోగ్యశిబిరాలను నిర్వహిస్తున్నారు. పాడి పరిశ్రమకు ప్రోత్సహించేందుకు పల్లెకు పోదాం.. పాడిని చూద్దాం, పాడిరైతు లాభాలను పెంచుదాం వంటి కార్యక్రమాలతో పాడిరైతులకు సేవలను మరింత విస్తృతం చేస్తున్నారు. పశువులకు బీమా సౌకర్యంతో పాటు ఇంటి వద్దే వైద్య సేవలందించేలా పశువైద్యవాహనాలను సమకూర్చారు. పశువులకు పచ్చగడ్డి అందుబాటులో వచ్చేలా నేపియర్ గడ్డి విత్తనాలు, దాణాను సబ్సిడీ ధరలపై రైతులకు అందిస్తున్నారు.

ఇదీ 'విజయ' సత్తా

పనిచేసి చూపిస్తామంటూ పాలసేకరణలో రోజుకు 10 లక్షల లీటర్లు మైలురాయి చేరడంతో పాటు పాలసేకరణ ధర రూ.2 నుంచి బోనస్‌తో కలిపి సుమారు రూ.92 చెల్లించడంతో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది కృష్ణామిల్క్ యూనియన్. అదే సమయంలో రూ.600 కోట్ల టర్నోవర్‌ను.. ఐదేళ్లలోనే రూ.1200 కోట్లకు చేర్చిన ఘనత పాలకవర్గానిదే. రూ.కోట్లాది వ్యయంతో విజయవాడలో 3వ బ్లాక్, వీరవల్లి వద్ద ప్రాజెక్ట్ కామధేను పాల ఫ్యాక్టరీ నిర్మించడంతో నిర్దిత సమయానికి ముందే పాల ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. గత సెప్టెంబరులో వరదల వల్ల విజయవాడ పాలఫ్యాక్టరీ 45 రోజులు మూతపడినా సకాలంలో పాల ఉత్పత్తులు అందించడం వీరవల్లి ఫ్యాక్టరీ వల్లే సాధ్యమైంది.

జాతీయ స్థాయి బ్రాండ్

మార్కెట్‌లో విజయ డెయిరీ పాలే కాకుండా అనేక పాల ఉత్పత్తులు దేశీయ మార్కెట్‌ను శాసిస్తున్నాయనే చెప్పాలి. పాలు, పెరుగు, బటర్ మిల్క్ సరఫరాలో ఉన్నత స్థానంలో ఉంది. అలాగే మలాయి లడ్డూ, ఖర్జూరం కోవా, బటర్ బర్ఫీ, చాక్లెట్ బర్ఫీ, దూద్ పెడ వంటి స్వీట్లకు ఎంతో క్రేజుంది. నెయ్యి, బటర్ స్కిమ్ మిల్క్ పౌడర్, యూహెచ్ టీమిల్క్ వంటివి ప్రఖ్యాతి పొందాయి. యూహెచ్‌టీ పాలకు హైదరాబాద్, ముంబాయి, కోల్‌కతా, చెన్నై, పూణె, గోవాలలో విస్తృతమైన మార్కెట్ ఉంది.

- 2 లక్షల మంది పాడి రైతులు
- రూ.1200 కోట్ల టర్నోవర్
- 11 కోట్ల లీటర్ల పాల సేకరణ
- 4 వేల మందికి ఉపాధి
- అధునాతన ప్రాజెక్టులు
- సంక్షేమ పథకాలు, అధిక పాలసేకరణ ధరతో లాభాలు

సవాళ్లకు ఎదురేగి..

సవాళ్లను ఎదుర్కొని అగ్రపథానికి పయనించిన కృష్ణా మిల్క్ యూనియన్, గత వైసీపీ ప్రభుత్వంలో రూపాయి గ్రాంటు ఇవ్వకపోయినా, మా ర్కెట్‌లో అమూల్ వంటి కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ గ్రామస్థాయి వరకూ సహకారమందించినా కృష్ణా మిల్క్ యూనియన్ నిలదొక్కుకుంది. అదే సహకారం స్థానిక కృష్ణామిల్క్ యూనియన్‌కు అందిస్తే మరోలా విజయాన్ని చేరకుంటారనేది వాస్తవం.

పశు సంరక్షణకు కంకణం

విజయ డెయిరీ పాడి పరిశ్రమాభివృద్ధికి దోహదపడుతోంది. పాడికి పరిశ్రమ హోదాను దృష్టిలో ఉంచుకుని పశువుల పెంపకాన్ని ప్రోత్సహించటం, రాయితీకి మంచి పుష్టికరమైన పశుదాణాను అందించటం, ఆరోగ్య పరిరక్షణ చర్యలు, వెటర్నరీ డాక్టర్లచే శిబిరాల నిర్వహిస్తుంటుంది. పశువులకు పూర్తి స్థాయిలో బీమా కల్పిస్తున్న ఏకైక సంస్థ విజయానే. ఇవన్నీ ఒక ఎత్తయితే మేలు జాతి పశువులను ఉత్పత్తి చేసేందుకు నాణ్యమైన పశువీర్యాన్ని సేకరించి పాడి రైతులకు సబ్సిడీపై అందిస్తోంది.

పాడి మీదనే మా కుటుంబ ఆధారం

అంబటి వీరాంజనేయులు, పాడిరైతు



15 ఏళ్లు నుంచి పశువులను సాకుతూ పాడిపైనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. గతంలో కంటే ఇప్పుడిస్తున్న పాలసేకరణధర సహాయకారిగా ఉంది. సంక్షేమ పథకాలు అందరికీ ఇవ్వడం ప్రోత్సాహకరం. పాలసేకరణ ధరను పెంచితే తమ లాంటి చిన్నకారు రైతులకు ఆర్థికంగా చేయూత అందుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

విజయాకు పాలు పోయటం రెండోతరం

పానుకుమాటి కోటయ్య, పాడిరైతు



నా తండ్రి తరువాత రెండో తరమైన మేము కృష్ణామిల్క్ యూనియన్‌కు పాలు పోస్తున్నాం. ప్రతి 15 రోజులకోసారి చెల్లింపులతో ఆర్థికంగా అండగా ఉంటోంది. పశువుల కొనుగోలుకు సహకారం ఇస్తున్నారు. పాలసేకరణ ధర పెంచితే ఇంకా లాభమే. ఛైర్మన్‌ను కలిసి మా సాధకబాధకాలు చెప్పుకోగలుగుతున్నాం.

పాడిరైతే యజమాని

ఛైర్మన్ చలసాని ఆంజనేయులు



ఆరుగాలం శ్రమించి పాలను సేకరించే పాడిరైతు కష్టానికి తగిన ప్రతిఫలం చెల్లించేలా కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గం కృషి చేస్తోంది. పాలసేకరణ నుంచి కోట్లాది రూపాయల స్థిరాస్తులు (పాల ఫ్యాక్టరీ నిర్మించడం) ఏర్పాటులో పాడిరైతుల సహకారం మరువలేనిది. పాలకవర్గం, పాడిరైతుల సమన్వయంతోనే ఆటుపోట్లను తట్టుకుని కృష్ణామిల్క్ యూనియన్ లాభాల బాటలో పయనిస్తోంది. దీనికి ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలుపుతున్నా.

'విజయ'ను నిలబెట్టిన అంశాలు

దేశంలోనే మిల్క్ డెయిరీల రంగంలో శరవేగంగా విస్తరిస్తున్న వాటిలో విజయ ముందు వరసలో ఉంది. విజయ డెయిరీని నిలబెట్టిన అంశాలేమిటన్నది పరిశీలిస్తే.. విజయ డెయిరీ కార్యకలాపాలు ప్రతి రైతుకు తెలియటం ప్రధానమైన అంశం. పాడి రైతులకు చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయి. చెల్లింపుల్లో జాప్యం జరగదు. రైతుల నుంచి సేకరిస్తున్న పాలలో ఎంత ఫ్యాట్ ఉంది, ఇతర కాంపోనెంట్స్ ఎంత శాతం ఉన్నాయన్న దానిపై పాడి రైతుల ఫోన్లకు మెసేజ్‌లు వెళుతుంటాయి. ఇలాంటి వ్యవస్థను మిగిలిన డెయిరీలలో చూడటం కష్టం.



సోమవారం విజయవాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టి.లక్ష్మీనారాయణ. వేదికపై వడ్డే శోభనాద్రీశ్వరరావు

'బనకచర్ల' ఆలోచన మానండి

- బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు సమర్థ వాదనలు వినిపించండి
- గోదావరి-కృష్ణా-పెన్నా అనుసంధానం చేపట్టండి
- కృష్ణా బోర్డు ఆఫీసు కర్నూలులో పెట్టాలి రాష్ట్రప్రభుత్వానికి అధ్యయన వేదిక
- సీమ సాగునీటి సాధన సమితి సూచన

అమరావతి/విజయవాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల వాటాలపై పునఃసమీక్ష చేస్తున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర హక్కులపై సమగ్ర, సమర్థ వాదనలు వినిపించాలని రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక, రాయలసీమ సాగునీటి సాధన సమితి సంయుక్తంగా డిమాండ్ చేశాయి. గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకాన్ని విరమించుకుని, గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానాన్ని (పోలవరం-సోమశిల) చేపట్టాలని తీర్మానించాయి. సోమవారం విజయవాడలో రాష్ట్ర రైతు సేవా సంస్థ అధ్యక్షుడు అక్కినేని భవానీప్రసాద్ అధ్యక్షతన కృష్ణా జలాలపై చర్చ జరిగింది. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ట్రిబ్యునల్ ముందు ఈ నెల 19-21 తేదీల్లో జరుగనున్న విచారణలో.. కృష్ణా, గోదావరి నదులపై తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకునేలా, కృష్ణా జలాలపై ఆంధ్రప్రదేశ్ హక్కులను పరిరక్షించేలా బలమైన వాదనలు వినిపించాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. కృష్ణా జలాలపై ఆధారపడి గడచిన మూడున్నర దశాబ్దాలుగా నిర్మాణంలో ఉన్న హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలిగొండ, తెలుగుగంగ ప్రాజెక్టులకు 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని తీర్మానించారు. గాలేరు-నగరి, హంద్రీ-నీవా అనుసంధాన పథకాన్ని కూడా విరమించుకోవాలని స్పష్టంచేశారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి కర్నూలుకు సత్వరమే తరలించేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని డిమాండ్ చేశారు. నదుల అనుసంధానం విషయంలో ప్రభుత్వం ప్రస్తుతం చేస్తున్న ఆలోచనల వల్ల రాయలసీమకు అన్యాయం జరుగుతుందన్నారు. సమగ్ర సాగునీటి విధానంలో భాగంగా మొదట తుంగభద్ర, కృష్ణా జలాల సద్వినియోగంతో ప్రాజెక్టుల నీటి హక్కుల పరిరక్షణను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలన్నారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధాన పథకాన్ని గొల్లపల్లి రిజర్వాయర్ వరకు నిర్మించాలని.. అక్కడి నుంచి సోమశిల మీదుగా పెన్నాకు అనుసంధానించాలని ప్రతిపాదించారు. బనకచర్లకు గోదావరి అనుసంధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇరిగేషన్ రంగ ప్రముఖులు, ఇంజనీర్లు కూడా తమ అభిప్రాయాలను సమర్థించారని తెలిపారు. గోదావరి-బనకచర్ల వల్ల ఎగువ రాష్ట్రాలు వాటా అడిగే ప్రమాదం ఉందని, కనుక కూటమి ప్రభుత్వం దానిని విరమించుకోవాలన్నారు. ఈ అంశాలపై తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. కృష్ణా బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని భవానీప్రసాద్ డిమాండ్ చేశారు. ఎన్ఎస్ఆర్ జోన్-2 ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ.. అక్రమ ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకున్న తెలంగాణకు అడ్డుకట్ట వేయాలన్నారు. కాగా.. అసంబద్ధ వాదనలకు కేంద్రం తలొగ్గి బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ గడువును పొడిగించి, జలాల పునఃసమీక్షపై విచారించాలని నిర్దేశించడం అత్యంత గర్హనీయమని సమావేశం పేర్కొంది. ఈ ట్రిబ్యునల్ 65 శాతం, 55 శాతం నీటి లభ్యత ప్రామాణికంగా లభించే మిగులు జలాలనూ అంచనా వేసి కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలోని రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తూ తీర్పు ఇవ్వడంతో సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ లీవ్ పిటిషన్ వేసిందని గుర్తుచేసింది. ఈ తీర్పును కేంద్రం కూడా నోటిఫై చేయలేదని, దీంతో అది అమల్లోకి రాలేదని తెలిపింది. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణను సుప్రీంకోర్టు ద్వారా అడ్డుకోవాలని సూచించింది. సమర్థులైన న్యాయవాదులను నియమించుకుని.. పటిష్ఠ వాదనలు వినిపించాలని కోరింది.




విద్యుత్ దీపాలంకరణలో వెలిగిపోతున్న ఆలయం

నేటి నుంచి పెద్ద తిరునాళ్లు

తిరుపతమ్మ అమ్మవారి కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 11 నుంచి 15 వరకు జరగనున్నాయి. ప్రధానంగా మంగళవారం రాత్రి 9.32 గంటలకు శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా భారీ సెట్టింగులతో పెద్ద ఎత్తున మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాన్ని ప్రాంగణాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే వేలాది మంది భక్తులకు అసౌకర్యం కలుగకుండా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. మామిడి తోటలో సుమారు 27 వేల మంది దీక్షాస్వాములకు దాతల సాయంతో భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులకు ఆలయానికి ఉత్తర వైపున ప్రత్యేక టెంట్స్‌ను ఏర్పాటు చేశారు. ఇరుముడులు సమర్పించే స్వాములకు గ్రామంలోని శివాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీక్షా స్వాములు విడిది కోసం తిరుపతమ్మ ఆలయంతో పాటు గ్రామంలోని పలు దేవాలయాల వద్ద షామియానాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఇరుముడులు సమర్పించేందుకు ఇచ్చిన దీక్షా స్వాములకు ఆర్యవైశ్యులు అల్పాహారం అందించారు. డిప్యూటీ కమిషనర్ కిషోర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎల్.రమా, తహసీల్దార్ శాంతి లక్ష్మి పర్యవేక్షిస్తున్నారు. పోలీసులు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.



బొర్రగూడెంలో కల్యాణోత్సవాలు

మైలవరం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రగూడెంలో వేంచేసియున్న తిరుపతమ్మ గోపయ్యస్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 11 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్టు ఈవో ఎం.తేజ సోమవారం తెలిపారు. 11న రంగుల మహోత్సవం, 12న కల్యాణం, 13న యాదవ రాజులచే జలబిందె జరుగుతాయన్నారు. ఈ కల్యాణాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో వైభవంగా అలంకరించారు. అమ్మవారి తలంబ్రాలకు విశిష్టత ఉంది. సంతానం లేని వారు తలంబ్రాలు తీసుకుంటే పిల్లలు పుడతారని భక్తులు ఎంతగానో విశ్వసిస్తారు.

వరప్రదాయిని వీరమ్మ తల్లి

తిరునాళ్లకు భారీగా తరలివచ్చిన భక్తులు



మొక్కుబడి తీర్చుకునేందుకు వెళుతున్న భక్తులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వీరమ్మ తిరునాళ్లకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. తిరునాళ్లలో 3వ రోజైన సోమవారం వేకువజాము నుంచి ఆలయం వద్ద భక్తుల సందడి కన్పించింది. చీర, సారె, పసుపుకుంకుమలు, గొర్రె, పొట్టేళ్లతో డప్పువాయిద్యాల నడుమ తరలివచ్చి, ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లు తయారుచేసి అమ్మవారికి సమర్పించి మొక్కుబడి తీర్చుకుంటున్నారు. ఉదయం నుంచి క్యూలైన్లలో నిలుచుని అమ్మవారిని దర్శించుకున్నారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు పలు సంస్థలు, వ్యక్తులు ప్రసాదం పంపిణీ చేశారు.

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం..

అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం లేక రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ నిలపడంతో రోడ్డుపై నడిచేందుకు ఖాళీలేక తిరునాళ్లకు వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎండలు మండుతున్న తరుణంలో క్యూలైన్లలో భక్తులకు నీడ కల్పించకపోవడంతో పిల్లలు, వృద్ధులతో కలిసి వచ్చినవారు క్యూలైన్లలో గంటల తరబడి ఎండలో నిలుచుని ఇబ్బంది పడ్డారు. ఆలయ ప్రాంగణం, రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడానికి వీలులేక ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

పోలీసుల వైఫల్యం

తిరునాళ్లలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కన్పిస్తోందని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయం వద్ద నడిచేందుకు వీలు లేకుండా వాహనాలు పార్కింగ్ చేసినా పట్టించుకోవడం లేదని, ఆదివారం రాత్రి అమ్మవారి ఊయల ఉత్సవం సందర్భంగా ఊయల స్తంభాల వద్ద తోపులాట వల్ల మహిళలు కిందపడిపోగా తొక్కిసలాట జరిగి స్వల్పంగా గాయపడిన ప్రమాదం తప్పింది. అమ్మవారి పల్లకిని ఊయల స్తంభాల వద్దకు తెచ్చేందుకు పోలీసులు రోప్‌టీమ్ ఏర్పాటుచేయడంలో వైఫల్యం చెందడం వల్లే ప్రమాదం జరిగిందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాటూరు రోడ్డులో సెంట్రల్ పార్కింగ్‌తో పాటు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలపడంతో ట్రాఫిక్‌కు సమస్య తలెత్తుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి రానున్న పది రోజుల్లో తిరునాళ్లకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో నిలిపిన వాహనాలతో నిలిచిన ట్రాఫిక్

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన

శ్రీవారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికపై బోర్డు సభ్యుల పేర్లు




ఆహ్వాన పత్రిక పై ఆలయ బోర్డు సభ్యుల పేర్లు ముద్రణ

వన్‌టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో పలువు రు కార్యనిర్వాహణ అధికారులు రాష్ట్రంలో ఇంకా వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉందనే భ్రమలో ఉన్నట్టున్నారు. ఆ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పలు ఆలయాల ట్రస్ట్ బోర్డు సభ్యులకు అధికారులు రాచమర్యాదలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈవో నాగం సన్యాసిరావు, వన్‌టౌన్‌లోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరగనున్న స్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈవో నటరాజన్ షణ్ముగం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ ఆహ్వాన పత్రికపై ట్రస్ట్ బోర్డు ఛైర్మన్, ధర్మకర్తల పేర్లను ముద్రించడం విమర్శలకు తావిస్తోంది. ఛైర్మన్లు, ధర్మకర్తలు చెప్పినట్టు అధికారులు వ్యవహరించటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు ఉన్నాయని తెలిసినా అధికారులు ఎలా ఛైర్మన్లు, ధర్మకర్తల పేర్లు ముద్రిస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఆటో ఢీకొని రైతు దుర్మరణం



పామర్రు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పామర్రు - గుడివాడ ప్రధాన రహదారిపై పట్టణంలోని పాండుబడ్డీ సెంటర్లో కొండిపర్రు ఆర్చి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానిక లైబ్రరీ వెనుక నివాసించే వ్యవసాయ రైతు తాడిశెట్టి సుబ్రహ్మణ్యం (65) సెంటర్లో బ్యాంకు పనులు ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా పాండు బడ్డీ సెంటర్లో గుడివాడ వైపు మితిమీరిన వేగంతో వస్తున్న ఆటో ఢీకొంది. దాంతో తీవ్రగాయాలతో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై రాజేంద్రప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని కేసునమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



మెట్రోకు భూ సేకరణ



- 101 ఎకరాలు కావాలంటూ మెట్రో అధికారుల ప్రతిపాదనలు
- ఎన్టీఆర్, కృష్ణాజిల్లా కలెక్టర్లకు పంపిన ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్
- ఎన్టీఆర్ జిల్లాలో రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: మెట్రో రైల్ ప్రాజెక్టుకు అవసరమైన భూముల కోసం ఎన్టీఆర్, కృష్ణాజిల్లా కలెక్టర్లకు ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు భూ ప్రతిపాదనలను అందజేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో చేపట్టే ప్రతిష్ఠాత్మకమైన విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు 101 ఎకరాల భూములు అవసరమని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు రెండు జిల్లాల కలెక్టర్లకు నివేదించారు. యుద్ధ ప్రాతిపదికన ఈ భూములు అప్పగించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఇప్పటికే సమావేశం నిర్వహించగా.. కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విజయవాడ మెట్రో ప్రాజెక్టు రెండు జిల్లాల్లో విస్తరించి ఉంది. తొలిదశలో గన్నవరం బస్‌స్టేషన్ నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా విజయవాడ విమానాశ్రయాన్ని అనుసంధానిస్తూ తిరిగి మళ్లీ ఎన్ హెచ్ - 16 మీదుగా రామవరప్పాడు రింగ్ వరకు అక్కడి నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్ వరకు కారిడార్-1, పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు కారిడార్-2 , పీఎన్‌బీఎస్ నుంచి అమరావతి రాజధానిలో లింగాయపాలెం వరకు కారిడార్-3, జక్కంపూడి నుంచి పీఎన్‌బీఎస్ వరకు రెండు వరసలలో కారిడార్-4, 5 ను ప్రతిపాదించారు. తొలిదశలో గన్నవరం - పీఎన్‌బీఎస్ (వయా ఏలూరు రోడ్డు), పెనమలూరు సెంటర్ - పీఎన్‌బీఎస్ (వయా బందరు రోడ్డు) కారిడార్లను మాత్రమే ప్రతిపాదించారు. తొలిదశలో చేపట్టే వాటికి మాత్రమే భూ ప్రతిపాదనలు అందజేశారు. రెండు జిల్లాల్లో కృష్ణాజిల్లాలోనే ఎక్కువగా భూములను సేకరించాలి. ఎన్టీఆర్ జిల్లాలో తక్కువ సేకరించాల్సి ఉంది. కృష్ణాజిల్లాలోని గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో ప్రధానంగా మెట్రో కోచ్ డిపోను ఏర్పాటు చేయటానికి నిర్ణయించారు. దాదాపుగా 50 ఎకరాల వరకు అవసరమని మెట్రో అధికారులు నివేదించారు.

భూ ప్రతిపాదనలు ఇలా..

విజయవాడ అర్బన్ పరిధిలో పటమటలో 3219.48 చదరపు గజాలు, మొగల్రాజపురం పరిధిలో 2857.64 చదరపు గజాలు, మాచవరం పరిధిలో 1990.22 చదరపు గజాలు, గుణదల పరిధిలో 4455.19 చదరపు గజాలు, విజయవాడ టౌన్ పోర్షన్‌లో 6055.43 చదరపు గజాలు, విజయవాడ గ్రామీణం పరిధిలో 1424.36 చదరపు గజాల చొప్పున ప్రతిపాదించారు. ప్రసాదంపాడు గ్రామంలో 2112.87 చదరపు గజాలు, నిడమానూరు గ్రామంలో 835.92 చదరపు గజాలు, ఎనికేపాడులో 3272.55 చదరపు గజాల చొప్పున భూ సేకరణలకు ప్రతిపాదించటం జరిగింది.

కలెక్టర్ లక్ష్మీశ సమావేశం

విజయవాడలో మెట్రో స్టేషన్లకు సంబంధించి భూముల సేకరణకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ ఎన్‌వీ రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. మొత్తం 48 చోట్ల మెట్రో స్టేషన్లకు భూ సేకరణ చేయాల్సి ఉంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్ 121, 130, 141
చికెన్ విత్ స్కిన్ 230
చికెన్ స్కిన్‌లెస్ 240
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475



వైద్య విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

కూచిపూడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థి వైద్య చదువు కోసం రూ.40 వేలు అందించి పెద్ద మనస్సు చాటుకున్నారు మొవ్వ జడ్పీ పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు మేకా రాణి. పాఠశాల పూర్వ విద్యార్థి కందుల పవన్ భాస్కర్ విశాఖపట్నంలో ఎంబీబీఎస్ మూడవ సంవత్సరం చదవుతున్నారు. పవన్ భాస్కర్ ఫీజుల నిమిత్తం హెచ్‌ఎం ఎస్.శ్రీదేవి చేతులమీదుగా నగదు అందజేశారు. విద్యార్థి కుటుంబసభ్యులు ఉపాధ్యాయురాలికి కృతజ్ఞతలు తెలిపారు.



పవన్‌భాస్కర్‌కు నగదు అందిస్తున్న ఉపాధ్యాయురాలు మేకా రాణి, హెచ్‌ఎం శ్రీదేవి

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



తహసీల్దార్ రామకోటేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని ఎన్నికల సమయంలో కూటమి హామీ ఇచ్చిందని, వెంటనే ఆ హామీని అమలు చేయాలని, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్లస్థలాలను ఊరి బయట, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో కేటాయించారని ప్రకాష్‌బాబు అన్నారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాలు సెంటు, సెంటున్నర స్థలాలు సరిపోవని అప్పట్లో ఆందోళన కార్యక్రమాలు చేశాయని ఆయన తెలిపారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు చింతలూరి సత్యనారాయణ, జి.నాగేశ్వ, పి.రంగారావు, కె.వెంకన్న, జ్యోతి, మల్లీశ్వరీ, సరస్వతి పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్ శ్రీనివాసరావుకు సమస్యలు వివరిస్తున్న బీజేపీ నాయకులు

గుడివాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో సమస్యలు పరిష్కరించాలని అధికారులను బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్కే) కోరారు. సోమవారం టిడ్కో కాలనీలో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావుకు ఆయన వినతిపత్రం అందజేశారు. టిడ్కో కాలనీలో చెత్త, చెదారం పెరిగిపోయిందని, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని వివరించారు. పందుల సంచరిస్తున్నాయని తెలిపారు. చెత్తసేకరణకు ప్రతి ఇంటికి డస్ట్‌బిన్లను అందించాలని కోరారు. రోజూ ఒక సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృషి చేస్తున్నారని, అయితే మున్సిపల్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. నాయకులు బోనం గోపిక, దేవరపల్లి చిన్న, లంకా రాంబాబు, రీటా, చరణ్, రాజు, టిడ్కో కాలనీవాసులు పాల్గొన్నారు.

పింఛన్ల పునఃపరిశీలన



పింఛన్‌దారుల ఇళ్లకెళ్లి పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

పామర్రు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అనర్హుల పింఛన్లను తొలగించి, అర్హులందరికీ అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పునఃపరిశీలన ప్రత్యేక బృందం అధికారి డాక్టర్ మన్నవ రవి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు పింఛన్లు మంజూరైనట్లు ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక తనిఖీ బృందాలతో తనిఖీలు చేయిస్తోంది. గుండెజబ్బులు, పక్షవాతం, డయాలసిస్, తలసేమియా వ్యాధులతో బాధపడుతూ మంచాలకే పరిమితమై రూ.15 వేలు పొందుతున్న మండలంలోని 43 మందిని అర్హులా కాదా? అని నిర్ధారించేందుకు గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్యనిపుణుల బృందం పరీక్షలు చేసింది. 42 మందికి పరీక్షలు పూర్తయ్యాయని, నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తామని తనిఖీ బృంద అధికారి వెల్లడించారు. మండలంలోని పీహెచ్‌సీ వైద్యులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు పరిశీలనలో పాల్గొన్నారు.

రూ.43 లక్షలతో 11 సీసీ రోడ్లు



దొండపాడులో నిర్మించిన నూతన సీసీ రోడ్లు

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వమొచ్చాక దొండపాడు గ్రామంలో రూ.43 లక్షలు వెచ్చించి 11 సిమెంట్ రోడ్లు నిర్మించింది. అంతర్గత రహదారులు నిర్మించి, ఇబ్బందులు తొలగించినందుకు గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి బహూకరణ

నందివాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పిన్నమనేని వీరయ్య చౌదరి స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి ప్రముఖ బిల్డర్ బొప్పన హరిబాబు రూ.17 వేలు విలువైన క్రీడా సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారావు, కాంతారావు, ఆర్వీఎల్ నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి

- పట్టభద్రుల సమావేశంలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్



పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుడివాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతికి అహర్నిశలు కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి పట్టభద్రులు మద్దతుగా నిలవాలని కూటమి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. సోమవారం వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో పట్టభద్రులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి విజయాన్ని చేకూర్చాలని ఆయన కోరారు. మంచి వ్యక్తిత్వం కలిగిన ఆలపాటికి పట్టభద్రులు మద్దతుగా నిలవాలని, శాసనమండలి ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వానికి అఖండ విజయాన్ని చేకూర్చాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. మచ్చలేని ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు కోరారు. గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో ఆలపాటి ఎన్నికల ప్రచారం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంజనీరింగ్, డిప్లమో కళాశాలల అధ్యాపకులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ గుడ్లవల్లేరు మండల కార్యాలయంలో ముఖ్యనాయకులు, బూత్ కమిటీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. మండలంలోని 1,400 మంది ఓటర్లను కలిసి కూటమి ప్రభుత్వం పనితీరును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించి పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓట్లు వేసేలా పనిచేయాలని ఆయన కోరారు. అనంతరం కౌతవరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వల్లభనేని బాబూరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జంగం మోహనరావు, టీడీపీ గుడివాడ పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, అడుసుమిల్లి రామ్మోహనరావు, డీసీ చైర్మన్ పాలేటి వీరాంజనేయులు, నీటి సంఘాల అధ్యక్షులు చలసాని శ్రీధర్, కరీం, తూము పద్మజ, పాల్గొన్నారు.

ఆలపాటిని గెలిపించాలి



తోట్లవల్లూరులో పట్టభద్రులను ఓట్లు అడుగుతున్న మైనేని ఇందిర, గోలి సింహాచలం

తోట్లవల్లూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని టీడీపీ కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మైనేని ఇందిర కోరారు. సోమవారం తోట్లవల్లూరులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గోలి సింహాచలం, గుత్తా రామకృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ ఫ్లెక్సీలు తొలగించలేదని అడిగితే పంచాయతీ కార్యదర్శి దుర్భాషలాడారు

- దళిత మహిళనని చిన్నచూపు చూస్తున్నారు
- పెదపారుపూడి సర్పంచ్ చప్పిడి సమీరా ఆరోపణ



మాట్లాడుతున్న సర్పంచ్ సమీరా

పెదపారుపూడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా పెదపారుపూడిలో అధికారపార్టీ ఫ్లెక్సీలే తొలగిస్తున్నారని, వైసీపీవి కనిపించడం లేదా అని ఫోన్‌లో పంచాయతీ కార్యదర్శి సురేంద్ర చౌదరిని తాను ప్రశ్నించానని సర్పంచ్ చప్పిడి సమీరా తెలిపారు. దీంతో కార్యదర్శి తనపై దుర్భాషలాడారని సర్పంచ్ మీడియాకు సోమవారం తెలిపారు. పంచాయతీ కార్యాలయానికి వచ్చి అడిగితే దళిత మహిళనని చిన్నచూపు చూస్తున్నారని సర్పంచ్ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి, ఈవోపీఆర్డీ ఇద్దరూ దళిత మహిళ అయిన తనను ఇబ్బంది పెడుతున్నారని, అభివృద్ధికి ఆటంకంగా మారారని, మేజర్ పంచాయతీ పెదపారుపూడిలో పంచాయతీ నిధులు సక్రమంగా వాడకుండా వారి ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఉపసర్పంచ్ నాగనబోయిన గాంధీ పాల్గొన్నారు.

బిషప్‌గా పాస్టర్ శ్యాంబాబు



శ్యాంబాబును అభిషేకిస్తున్న బిషప్‌లు

గుడివాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తెలంగాణ, చెన్నై ఆర్చ్ బిషప్‌ల ఆధ్వర్యంలో జీసస్ లైట్ ప్రేయర్ టెంపుల్ పాస్టర్ జి.శ్యాంబాబును బిషప్‌గా అభిషేకించారు. నేషనల్ ఇండిపెండెంట్ బిషప్ కౌన్సిల్ ఎపిస్కోపోల్ డయాసిస్ తరపున సికింద్రాబాద్‌లోని హౌస్ ఆఫ్ జీసస్ చర్చ్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్యాంబాబు చేస్తున్న సేవలు, పరిచర్యలను గుర్తించి బిషప్ ఆర్డినేషన్ చేశామని బిషప్ ఆర్డినేషన్స్ నిబ్ కౌన్సిల్ చైర్మన్ ఆర్చ్ బిషప్ కాట్రగడ్డ మార్టిన్‌నిబ్ తెలిపారు. ఇవాలంజలిస్టుగా 20 ఏళ్లు, సంఘ కాపరిగా పాతికేళ్లు క్రైస్తవ పత్రిక సంపాదకుడిగా, జర్నలిస్టుగా గుర్తింపు పొంది, పదేళ్లుగా పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ నాయకునిగా దేవునిసేవలో శ్యాంబాబు గుర్తింపు పొందారన్నారు. ఆర్చ్ బిషప్స్ సీహెచ్ ప్రియంత్, జాన్ మార్క్యేండేయ, ఐజక్ దమేరా, భాస్కరరావు, మణి, బి.కరుణాకర్, భాస్కర్‌రెడ్డి, జయకుమార్, డానియేల్, పలు రాష్ట్రాల్లో ఉన్న పలువురు దైవ సేవకులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాను అభినందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

పుణెలో లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొని తిరిగొచ్చిన ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సోమవారం మర్యాదపూర్వకంగా సీఎం చంద్రబాబు నాయుడును కలిశారు. కాంక్లేవ్‌లో స్వర్ణాంధ్ర విజన్, పేదరిక నిర్మూలనకు రూపొందించిన పీ4 విధానాలపై ప్రస్తావించానని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో కుమార్‌రాజాను సీఎం అభినందించారు.

- విజయవాడ



గుంటూరు వెళుతున్న ఆటోనగర్ కార్మికులు

కేఎస్ లక్ష్మణరావు నామినేషన్‌కు తరలిన కార్మికులు

గుడివాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గుంటూరులో సోమవారం పీడీఎఫ్ కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు నామినేషన్‌కు సీఐటీయూ అనుబంధ ది కృష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 41మంది తరలివెళ్లారు. లక్ష్మణరావుకు ఓటేసి గెలిపించాలని, టీ షర్టులను ధరించి ప్రదర్శన లో పాల్గొన్నారు. హమీద్, ఖుద్దూస్, టి.లక్ష్మణరావు, ఆంజనేయులు, బాషా, వీర్రాజు, నాగరాజు, కల్వకుంట నాగరాజు, జోజిబాబు, శ్యాంకుమార్, ఆదినారాయణ, ఖాజా, రెహ్మాన్, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేస్తా

- ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాను ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానని, అందుకోసం రోజూ వార్డుల్లో పర్యటిస్తున్నానని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. సోమవారం ఉదయపు పర్యటనలో భాగంగా కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజుతో కలిసి ఆయన ధనియాలపేటలో పర్యటించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూస్తానని, అమృత్ స్కీంలో భాగంగా పెండింగ్ ఉన్న పైపులైన్ల పనులను తక్షణమే పూర్తి చేసేలా చూస్తానని ఆయన తెలిపారు. వార్డు ప్రజలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీరమ్మ ఆలయ ప్రతిష్ఠకు రండి

- ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు ఆహ్వానం

గుడ్లవల్లేరు: మామిడికోళ్ల గ్రామంలో ఈనెల 15 నుంచి 17 వరకూ వీరమ్మ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించనున్నారు. మహోత్సవాల ఆహ్వానపత్రికను సోమవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు నిర్వాహకులు అందజేశారు. ఆలయ వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యేతో ప్రారంభింపజేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్‌ను కూడా నిర్వాహకులు ఆహ్వానించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో విఘ్నేశ్వర, వీరమ్మ విగ్రహాల ప్రతిష్ఠ 17వ తేదీ నిర్వహించనున్నారు. విశిష్ట అతిథులుగా ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హాజరుకానున్నారు. తోట మల్లికార్జునరావు, కూసం హనుమప్రసాద్(బుజ్జి), తోట వి.వి.వి.ప్రసాద్, తోట నరేంద్ర పాల్గొన్నారు.

అన్నదానం, చీరల పంపిణీ



వృద్ధాశ్రమంలో చీరలు పంపిణీ చేస్తున్న వెంకట్ రవితేజ

గుడివాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో లయన్ ఉప్పల వెంకటేశ్వరరావు మునిమనమడు అవ్యాన్ రెండో జన్మదినం సందర్భంగా తల్లిదండ్రులు వెంకట్ రవితేజ, తనూజ దంపతులు పట్టణంలోని కర్ల కోటేశ్వరరావు ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేసి భోజనాలు పెట్టారు. హరికుమార్, ఉప్పల ప్రజ్ఞతే బాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.

రొయ్యూరులో ఇసుక క్వారీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాస్, పక్కన ఆర్డీవో హేల షారోన్

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రొయ్యూరు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నూతన ఇసుక క్వారీ ఏర్పాటుపై పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ కోసం సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆర్డీవో హేలా షారోన్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాస్, తహసీల్దార్ ఎం కుసుమకుమారి పాల్గొన్నారు. రొయ్యూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 270లో 25 హెక్టార్ల విస్తీర్ణంలో క్వారీ ప్రారంభించి 2.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలు జరిపిపేందుకు సదస్సు ఏర్పాటు చేశామని ఆర్డీవో వివరించారు. గ్రామంలో అవసరాలకు ప్రజలు ఇసుక తీసుకెళ్లొచ్చని, 12 ఎకరాలు దాటిన క్వారీలో మినీ జేసీబీలు ఉపయోగించే అంశంపై ప్రజలు అభిప్రాయాలను తెలపాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. దీంతో కార్మికులు వేదిక వద్దకు వచ్చి యంత్రాలు వినియోగిస్తే తమ ఉపాధి దెబ్బతింటుందని, మీకెంత ఇసుక అవసరమైనా తాము లోడింగ్ చేసి అందిస్తామని, ఇదే తమ అభిప్రాయమని స్పష్టం చేశారు. సంతకాలు చేసి అందించాలని, వెంటనే సదస్సు ముగించి వెళ్లిపోయారు. వీఆర్వోలు సీహెచ్ శ్రీనివాసరావు, బసవరావు పాల్గొన్నారు.

నేడు తోట్లవల్లూరులో సదస్సు

తోట్లవల్లూరులో మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు జరుగనుందని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తెలిపారు.

మోటూరులో 100 ఎకరాల్లో కలుపు సమస్య

- ప్రముఖ షాపులో మందు తెచ్చి మినుముపై రైతుల పిచికారీ
- నివారణ కాని కలుపు



గుడివాడ రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మినుములో కలుపు నివారణకు నెల కింద ప్రముఖ ఎరువుల షాపులో మందు తెచ్చామని, పిచికారీ చేసినా కలుపు నివారణ కాలేదని మోటూరు రైతులు ఆరోపిస్తున్నారు. 100 ఎకరాల్లో ఈ సమస్య ఉందని చెబుతున్నారు. మండల వ్యవసాయాధికారి అనంతలక్ష్మిని వివరణ కోరగా, కలుపు మందు పిచికారీ చేసిన వారానికే నివారణ జరుగుతుందన్నారు. నెల తర్వాత కలుపు నివారణ కాలేదని రైతులు అంటున్నారని అన్నారు. బయోఫెర్టిలైజర్స్ చల్లటం వల్ల కలుపు నివారణ అయిన తర్వాత కూడా కలుపు, ఊద పెరుగుతుందని తెలిపారు. మంగళవారం వెళ్లి పరిశీలిస్తామన్నారు.

నంబరు ప్లేటు లేకుండా తిరిగితే చర్యలు

- వాహనదారులకు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ హెచ్చరిక

గుడివాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో వాహనాలకు నంబరు ప్లేటు లేకుండా తిరిగితే చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ కె.శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. నెంబరు ప్లేటు లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి, అక్కడే వాహనదారులతోనే నెంబరు ప్లేట్లు వేయించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పామర్రు, కూచిపూడి, తోట్లవల్లూరు హైస్కూళ్లలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యులు

నులిపురుగుల నిర్మూలనతో చిన్నారులకు ఆరోగ్యం

పామర్రు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నిర్మూలన ద్వారా చిన్నారులకు ఆరోగ్యం చేకూరుతుందని కనుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి టి.రాజేష్ అన్నారు. కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు నులిపురుగుల నివారణమాత్రలు పంపిణీ చేశారు. అస్సెసీ, ఏఎన్‌ఎం ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఏఎన్‌ఎంలు మాత్రలు వేశారు. హెచ్‌ఎం ఆలపాటి ఇందిరారాణి, శామ్యూల్, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు. నిమ్మకూరు, జమీగోల్వేపల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, ఏపీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించి మాత్రలను పంపిణీచేశారు. మండలవ్యాప్తంగా99శాతం మాత్రలు పంపిణీ చేసినట్టు డాక్టర్ రాజేష్ తెలిపారు.

5,380 మందికి మాత్రల పంపిణీ

కూచిపూడి: మొవ్వ మండలంలోని 16 సచివాలయాల్లో 19 ఏళ్లలోపు పిల్లలు 5,380 మందికి నులిపురుగు నివారణ మాత్రలు అందజేశారు. అంగన్వాడీ కేంద్రాలు, ఎంపీ, ఎలిమెంటరీ, అప్పర్ ప్రైమరీ, జడ్పీ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

తీసుకోనివారికి 17న పంపిణీ

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.సాయి ప్రసన్న పంపిణీ చేశారు. తీసుకోని వారి కోసం మళ్లీ 17వ తేదీన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి మాత్రలను పంపిణీ చేస్తామని తెలిపారు. సీహెచ్‌వో పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో..

గుడ్లవల్లేరు: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నులిపురుగుల నివారణా మందులను వేశారు. శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో 147 మంది విద్యార్థులకు వారు మందులు పంపిణీ చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	121, 130, 141
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

బెరాకా మినిస్ట్రీస్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న మంత్రి రవీంద్ర, కిరణ్‌పాల్

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు బెరాకా మినిస్ట్రీస్ చేస్తున్న సాయం వెలకట్టలేనిదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ముగ్గురు బీటెక్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ముగ్గురు విద్యార్థులకు ఆర్థిక సాయం మంత్రి అందజేశారు. బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్‌పాల్, ఎస్.ఎస్.వి.ఎస్.వి. ప్రసాద్, కాగిత రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న చేను పరిశీలన

చల్లపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మొలకెత్తని మొక్కజొన్న పొలాన్ని వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. నడకుదురు గ్రామంలో రైతు, సర్పంచ్ గొరిపర్తి సురేష్ సాగుచేస్తున్న రెండున్నర ఎకరాల పొలాన్ని ఏడీఏ ఎస్.శ్యామల, ఏవో జి.సాయిసింధు సందర్శించారు. మొక్కజొన్న విత్తనాలు ఏమేరకు మొలకెత్తాయో పరిశీలించి, రైతు నుంచి వివరాలు సేకరించారు. మొలకెత్తని విత్తనాల కారణంగా నష్టపోయిన రైతుకు తగు న్యాయం చేసేందుకు కృషి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. క్షేత్ర పరిశీలన, రైతు ఫిర్యాదులపై నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు.



బందరులో టీడీపీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర



మోపిదేవిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న కొనకళ్ల, మండలి

ఆలపాటిని భారీ మెజారిటీతో గెలిపించాలి



ప్రచార పత్రాలను ఆవిష్కరిస్తున్న మండలి, పట్టాభిరామ్



తరకటూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాగిత



చల్లపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. బందరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల విస్తృత సమావేశం సోమవారం జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. సాధారణ ఎన్నికల్లో తెనాలి సీటును త్యాగం చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించి బహుమతిగా ఇవ్వాలన్నారు. ఎన్నికల పరిశీలకుడు దత్త, టీడీ పీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, కాగిత వెంకటేశ్వరరావు, బాబా ప్రసాద్, సోమ శేఖర్, కుంచే నాని పాల్గొన్నారు.

అతి విశ్వాసం వద్దు : కొనకళ్ల

మోపిదేవి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుస్తామనే అతి విశ్వాసం వద్దని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు విజ్ఞప్తి చేశారు. శాసనమండలి ఎన్నికలకు సంబంధించి కూటమి పార్టీల సమావేశంలో కొనకళ్ల పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రత్యక్షంగా జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికలలో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఉగాది తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించనున్నట్లు కొనకళ్ల నారాయణరావు తెలిపారు. ప్రచార కరపత్రాలు ఆవిష్కరించి ఓటర్లను ఓటు అభ్యర్థించారు మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జనసేన, బీజేపీ మం డల పార్టీల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, సనకా ప్రశాంత్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, నాయకులు మండలి వెంకట్రామ్, బొబ్బా గోవర్ధన్, కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, దివి యుగంధరి, రావి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అవనిగడ్డలో..

అవనిగడ్డ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పని చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ అన్నారు. అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతలతో పట్టాభి రామ్ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. సకల జనుల శ్రేయస్సే ఎన్డీఏ కూటమి ధ్యేయం కరపత్రాన్ని కొమ్మారెడ్డి పట్టాభి రామ్, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావులతో కలిసి ఆవిష్కరించారు. మండలి బుద్ధప్రసాద్ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ లాంటి వ్యక్తిని గెలిపించటం ద్వారా చట్టసభల గౌరవం మరింతగా ఇనుమడిస్తుందని అన్నారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, కనపర్తి శ్రీనివాసరావు, పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాగిత అభ్యర్థన

గూడూరు : ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కోరారు. గూడూరు, తరకటూరు గ్రామాలలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు గొట్టుముక్కల రఘురామరాజుతో పట్టభద్రులను కలసి ఓట్లు అభ్యర్థించారు. పంచకర్ల సురేష్, మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి, దాసరి ఉమాసాయిరామ్, కోలపల్లి రజని, గోపీ నాగబాబు, ఎస్‌ఏ బేగ్, అన్నం హరిరామ కృష్ణ, పోతన రామోజీ, తరకటూరు సర్పంచ్ చిన్నం వెంకటరమణమ్మ, కాట్రగడ్డ రత్నబాబు, సత్యనారాయణ, కృష్ణ, రాము, బాసంశెట్టి శ్రీను, అయ్యప్ప, కేశవ, యారా ప్రసాద్, బేతల స్వామి, బాసంశెట్టి విజయ్, నలిగిలి కిరణ్ పాల్గొన్నారు.

చల్లపల్లిలో ప్రచారం

చల్లపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్(రాజా)ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కూటమి నేతలు విజ్ఞప్తి చేశారు. శాసన మండలి ఎన్నికల సందర్భంగా సోమవారం చల్లపల్లిలో టీడీపీ, జనసేన నేతలు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు ఆలపాటి రాజాకు వేయాలని కోరారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, షేక్ నబీఘోరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తోట కనకదుర్గ, బావిశెట్టి కనకదుర్గ, గంగాధరరావు పాల్గొన్నారు.

నాగాయలంకలో నేడు

నాగాయలంక : ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం ఉదయం 10 గంటలకు నాగాయలంకలోని బండ్రెడ్డి వెంకటేశ్వరరావు మిల్లు ప్రాంగణంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు తెలిపారు.



అమ్మవారి కుంకుమ అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చౌడేశ్వరిదేవి జ్యోతిర్మహోత్సవాలు ప్రారంభం

పెడన, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : దేవాంగుల ఆరాధ్యదేవత చౌడేశ్వరీదేవి జ్యోతిర్మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మపురంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉత్సవాలను ప్రారంభించారు. దేవాంగ కులస్తులందరికీ అమ్మవారి కుంకుమ పంపిణీ చేశారు. కుంకుమ స్వీకరించిన దేవాంగులు సోమవారం నుంచి చేనేత పనులు నిలిపివేశారు. ఉత్సవాలు ముగిసే వరకు వారు చేనేత పనుల జోలికి వెళ్లరు. ఉత్సవాల్లో పూర్తి సమయం నియమ నిష్ఠలతో అమ్మవారి సేవకే కేటాయిస్తారు. మంగళవారం తెల్లవారుజామున పట్టణంలోని శివాలయం వద్ద ఆనపూజ చేస్తారు.



ఏడుకొండలు కుటుంబానికి రామకృష్ణ పరామర్శ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో వేటకు వెళ్లి జాడ తెలియకుండా చింతా ఏడుకొండలు కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. సత్రవపాలెంలో ఏడుకొండలు భార్య వెంకటేశ్వరమ్మ, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ సోమవారం పరామర్శించారు. సమస్యను ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గడ్డం రాజు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడుగా చిన్నాపురం పంచాయతీ కార్యదర్శి జె.రాధాకృష్ణ ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడుగా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కె. కోటేశ్వరరావు,ఉపాధ్యక్షుడిగా జె. రవిశంకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డి.వి.సుబ్బారావు, కోశాధికారిగా బి. అనిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా వై.సాయిఫణీంద్రకుమార్, ఏ.దివ్య, సహ సంయుక్త కార్యదర్శులుగా టి. దేవేంద్రకుమార్, వి.మాధవి, ప్రచార కార్యదర్శిగా కె. దినేష్‌తేజ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఈవోపీఆర్డీ బాలకృష్ణారావు వ్యవహరించారు. కార్యవర్గాన్ని ఎంపీడీవో సిహెచ్. వెంకటేష్, డీఎల్‌పీవో సీతారామయ్య, సీనియర్ అసిస్టెంట్ సీతారామయ్య అభినందించారు.

ఎస్పీని కలిసిన లారీ అసోసియేషన్ నాయకులు

లబ్బీపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల సందర్భంగా సీజ్ చేసిన వాహనాలను విడుదల చేయాలని కోరుతూ ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఎస్పీ ఆర్.గంగాధర్‌ను మచిలీపట్నంలో సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రమాదం జరిగినప్పుడు వాహనాల రికార్డును పరిశీలించి, సక్రమంగా ఉంటే డ్రైవర్‌కు స్టేషన్ బెయిల్ ఇచ్చి వాహనం విడుదల చేయాలని డీజీపీ ఉత్తర్వులిచ్చినా చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో అమలు కావటం లేదన్నారు. ఫిబ్రవరి 2న ఒక లారీపై 304ఏ కింద కేసు నమోదు చేసిన పోలీసులు డ్రైవర్‌కు బెయిల్ మంజూరు చేసి లారీని విడుదల చేయలేదని వివరించారు. స్పందించిన ఆయన డీఎస్పీకి చేసి న్యాయమూర్తితో ఈ విషయంపై మాట్లాడి లారీని విడుదల చేయాలని ఆదేశించారు. ఎస్పీని కలిసిన వారిలో జిల్లా సంఘం అధ్యక్షుడు నాగమోతు రాజా, మాజీ అధ్యక్షుడు రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయాధికారి అరుణసారిక

విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు ర్యాలీ

మచిలీపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి అరుణసారిక తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల గుర్తింపుపై అవగాహనా ర్యాలీని జిల్లా కోర్టు ప్రాంగణంలో సోమవారం ఆమె జెండా ఊపి ఆమె ప్రారంభించారు. విభిన్న ప్రతిభావంతుల గుర్తింపులో అందరూ భాగస్వాములు కావాలన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ముఖమండపానికి శంకుస్థాపన

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : దొంతులమ్మ దేవాలయంలో ముఖమండపానికి వేదపండితులు సోమవారం శంకుస్థాపన జరిపారు.

ఇల్లు దగ్ధం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కొత్తపూడిలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించి మాదిరెడ్డి సుబ్బారావుకు చెందిన ఇల్లు దగ్ధమైంది. అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపు చేశారు.



రూ.51,116 విరాళం

ఘంటసాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఘంటసాలలో వేంచేసి ఉన్న భద్రావతి సమేత భావనారుషి దేవాలయ ముఖమండపానికి స్టీల్ గ్రిల్ నిమిత్తం దేవాలయ కమిటీ సభ్యులు మురుగుడు నాంచారయ్య - లక్ష్మీల కుమారుడు యోగేంద్ర - అనుపమ రూ.51,116 విరాళాన్ని కమిటీ చైర్మన్ అందె జగదీష్‌కు అందజేశారు. జగదీష్ మాట్లాడుతూ గ్రిల్స్‌కు రూ.4.50 లక్షలు ఖర్చు అవుతుండగా, రూ.2.50 లక్షలు దాతలు విరాళంగా ఇచ్చారని, ఇంకా రూ.2 లక్షలు అవసరమని, భక్తులు సహకారం అందించాలని కోరారు.





బంగారు పతకం సాధించిన నాగిడి గాయత్రిని అభినందించి సత్కరిస్తున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

స్వర్ణపతక విజేత నాగిడి గాయత్రికి మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే మండలి అభినందన

మచిలీపట్నం/అవనిగడ్డ టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన నాగాయలంక క్రీడాకారిణి నాగిడి గాయత్రిని బందరులో మంత్రి రవీంద్ర, అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. శిక్షణ ఇచ్చిన దావులూరి సురేంద్రబాబును మంత్రి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో జర్మనీలో శిక్షణ తీసుకోవాలన్న గాయత్రి కోరికను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళతామన్నారు. జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ ఝాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా నాగిడి గాయత్రిని కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అభినందించారు. ఎన్నారై బొబ్బా గోవర్ధన్, నేతలు మండవ బాలవర్ధిరావు, మత్తి వెం కటేశ్వరరావు, కర్రా సుధాకర్, కొల్లూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.